సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 10 । జూలై । 2024



ప్రతిభ చూపితే.. భవిత మీదే

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు, సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్ షిప్‌ను అందజేస్తోంది. -8లో



రోటరీ సేవలకు పురస్కారాల పంట

విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో అందించిన సేవలకు పురస్కారాల పంట లభించింది. -8లో



గంగ పుత్రుల బెంగ

సముద్రంలో చేపల వేట ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం మత్స్యకార భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. -8లో

న్యూస్‌రీల్

పొల్ల ఆశ్రమ పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ నారాయుడు

సీతంపేట: ఐటీడీఏ డిప్యూటీఈఓ పాలక నారాయుడు పెద్ద పొల్ల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమపాఠశాలను మంగళవారం సందర్శించారు. అక్కడ విద్యార్థుల చదువును పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలి కవసతులపై ఆరా తీశారు. మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపడా ఉన్నాయా లేదా అన్నది చూశారు. విద్యార్థులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, హెచ్ఎం ఎం.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

55 మందికి ఈసెట్ కౌన్సెలింగ్



కళాశాల ప్రిన్సిపాల్ విలియం క్యారీ

పార్వతీపురంటౌన్: ఏపీ ఈసెట్ ఆరో రోజు 55 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎమ్మార్‌నగరం పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ విలియం క్యారీ అన్నారు. పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ ప్రక్రియ బుధవారంతో ముగుస్తుందని తెలిపారు. గత ఐదు రోజుల్లో 660 ధ్రువ పత్రాలు పరిశీలించినట్లు క్యారీ తెలిపారు.

ఇసుక సరఫరా ప్రారంభం



ఇసుకను నాటుబండిలో వేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామం వద్ద గల వేగావతి నది నుంచి ఇసుక సరఫరాను స్త్రీ శిశుసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నదిలోని ఇసుకను నాటుబండికి పారతో ఎత్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



నదిలో నుంచి బయటకు తీసుకువస్తున్న మృతదేహం



గొట్టిపల్లి గోవింద రావు (ఫైల్)

గరుగుబిల్లి: మండల కేంద్రానికి చెందిన గొట్టిపల్లి గోవిందరావు(57) తోటపల్లి ప్రాజెక్టు వద్ద నాగావళి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోవిందరావు ఉదయం ఇంటినుంచి బయల్దేరి తోటపల్లి ఐటీడీఏ పార్క్, బోటు షికారు ప్రాంతానికి వెళ్లి నదిలో దూకేశాడు. మతిస్థిమితం లేకపోవడంతోపాటు అనారోగ్యం కారణంగా ఈ చర్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఓ వ్యక్తి నదిలో దూకిన సమాచారం తెలుసుకున్న పోలీసులు గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సత్యవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భామినిలో భారీ వర్షం



భామిని మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

భామిని: మండలంలో మంగళవారం రోజంతా వాన కురిసింది. దఫదఫాలుగా కురిసిన వర్షపు జల్లులు రైతులకు ఊరట నిచ్చాయి. ఇప్పటికే నాటిన పత్తి, వరి పంటకు వర్షం ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.



మంచం పట్టిస్తున్న మలేరియా

- చిన్నారుల్లో అధికంగా వ్యాప్తి
- సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చేరిన 15 మంది విద్యార్థులు
- సెలవులో ఇద్దరు పీడియాట్రిక్స్
- నెలరోజుల్లో 200లకు పైగా కేసుల నమోదు



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో మలేరియాతో చికిత్స పొందుతున్న చిన్నారులు

సీతంపేట: ఏజెన్సీలో మలేరియా పడగ విప్పింది. అడపాదడపా వర్షాలు కురుస్తుండడం, మురికి కుంటల్లో దోమల వృద్ధితో చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. మలేరియా బాధితుల్లో చిన్నారులు అధికమంది ఉండడం వైద్య వర్గాలను కలవరపెడుతోంది. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో మలేరియా జ్వరాలతో అస్వస్థతకు గురై 15 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. రెండురోజుల్లో 30 మందికిపైగా చిన్నారులు జ్వరాలతో వైద్యసేవల కోసం ఆస్పత్రికిరాగా, వీరిలో 15 మందికి మలేరియా పాజిటివ్‌గా వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. మలేరియా నివారణ శాఖ అధికారులు మలేరియా పీడిత గ్రామాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్నా కేసులు నమోదవుతున్నాయి. గత నెలరోజుల్లో 200లకు పైగా మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలు పొందిన వారిని లెక్కిస్తే ఈ సంఖ్య రెట్టింపవుతుందని వైద్యులు చెబుతున్నారు. దోనుబాయి, పొల్ల, సీతంపేట పరిసర గ్రామాల్లో ఎక్కువగా మలేరియా వ్యాప్తి చెందుతోంది. ఒక కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరూ జ్వరాలతో సీతంపేట ఏరియా ఆస్పత్రికి వస్తుండడం గమనార్హం. ఆస్పత్రిలో ఉన్న చిన్నపిల్లల (పీడియాట్రిక్) వైద్యులు ఇద్దరూ సెలవులో ఉండడంతో జనరల్ వైద్యులే సేవలందిస్తున్నారు.

చాలీచాలని బెడ్లతో అవస్థలు..

సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చాలీచాలని బెడ్లతో జనం అవస్థలు పడుతున్నారు. వంద పడకల ఆస్పత్రికి కేవలం 60 బెడ్ల వరకు ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏరియా ఆస్పత్రి అదనపు భవనాలు పూర్తి కాకపోవడంతో బెడ్‌లు కూడా వేయలేని స్థితి నెలకుంది. వరండాలు, ఇతర గదుల్లో బెడ్‌లు వేసి రోగులకు సేవలందిస్తున్నారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు రోగులు వైద్యసేవలు పొందుతున్నారు.

మలేరియా కేసులు ఎక్కువగా వస్తున్నాయి



ఇటీవల కాలంలో మలేరియా పాజిటివ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. చిన్నారుల్లో ఈ వ్యాధి ఎక్కువగా ఉంది. జ్వరంతో వచ్చిన వారికి మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయితే ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని సేవలందిస్తున్నాం. ప్రస్తుతానికి మందుల కొరత లేదు.

– బి.శ్రీనివాసరావు, సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

‘సూపర్ సిక్స్’ అమలెప్పుడు?

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలులోకి తెస్తారో ప్రజలకు తెలియజేయాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మంగళవారం మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమైనా రైతుల ఖాతాలకు పెట్టుబడి సాయం జమకాలేదన్నారు. విద్యార్థులకు ‘తల్లికి వందనం’ లబ్ధి ఎప్పుడిస్తారో స్పష్టత లేదని వాపోయారు. ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు, 19 ఏళ్ల పైబడిన మహిళలకు నెలకు రూ.1500 వంటి హామీలను తక్షణమే అమలులోకి తేవాలన్నారు. పింఛన్ మినహా ఇంకా ఏ ఒక్క పథకమూ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. పథకాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, అమలులోకి తేకుంటే ఆందోళన చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులు, మహిళలు సిద్ధపడే అవకాశం ఉందన్నారు. మన్యంలో సీజనల్ వ్యాధులు ముసురుకున్నాయని, వైద్యసేవలు ముమ్మరంగా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకానికి ప్రతిపాదనలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాల సమస్య పరిష్కారానికి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి కృషి చేయాలని కోరారు. ఒడిశా ప్రభుత్వం గంజాయిభద్ర, పట్టుచెన్నేరు, పగులు చెన్నేరు పంచాయతీల వరకు సేవలు విస్తరిస్తోందని, రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభుత్వం మద్దతు ఉండడంతో ఏపీకి నష్టం జరగకుండా సమన్వయంతో సమస్య పరిష్కారానికి కృషిచేయాలన్నారు. సాలూరులో గిరిజన వర్సిటీ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు మంత్రి చొరవచూపాలన్నారు.

ఐఎఫ్ఎస్ అధికారుల పర్యటన



సమీక్షిస్తున్న డిప్యూటీ హై కమిషనర్ డాక్టర్ సత్యంజల్ పాండే, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, తదితరులు



గుడారివలసలో మహిళలతో సంభాషిస్తున్న కలెక్టర్, తదితరులు

పార్వతీపురం: ఇండియన్ ఫారెన్ సర్వీసెస్(ఐఎఫ్ఎఫ్)కు చెందిన ఇద్దరు అధికారులు తమ మిడ్ కెరీర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్వతీపురం మండలం గుడారివలస గ్రామంలో పర్యటించారు. కొలంబోలోని భారత డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ సత్యంజల్ పాండే, 2008 బ్యాచ్‌కు చెందిన ఎంఈఏ డైరెక్టర్ వీఎస్‌డీఎల్ సురేంద్రలు వీడీవీకేల లబ్ధిదారులు, అభిలాష లైబ్రరీల వినియోగదారులతో సంభాషించారు. అభిలాష లైబ్రరీలు, ఇన్నోవేట్, హబ్, జన్మన్, వందన్ వికాస్ కేంద్రాలు, మైస్కూల్, మై ప్రైడ్ తదితర కార్యక్రమాల గురించి ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ వారికి వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వస్తువును ఉత్పత్తి చేసినపుడు దాని ప్రాముఖ్యత, ఉత్పత్తి ఆవశ్యకత, అవసరాన్ని ప్రచారం చేయాలని సత్యంజల్ పాండే సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, డీఆర్ఓ జి.కేశవనాయుడు, ఆర్డీఓ కె. హేమలత, ఏపీఓ ఎ.మురళీధర్, సీపీఓ టి.వీర్రాజు, జీసీసీ డీఎం వి. మహేంద్రకుమార్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహిద్దాం

పార్వతీపురం: చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులు సంభవిస్తే ఎదుర్కొవడానికి అవసరమైన తాత్కాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రాంతంలో సాగుకు అనువైన జీడిమామిడి, పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యాన పంటల్లో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు ఉపాధి పథకం పనులతో అనుసంధానం చేయాలన్నారు. ప్రతీ ఇంటికి తాగు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అమృత్ సరోవర్ చెరువులు మరింత ఆకర్షణీయంగా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, మత్స్యశాఖాధికారి తిరుపతయ్య, పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.మన్మథరావు, మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డుమా పీడీ కె.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేశాం.. మళ్లీ తోడుగా ఉందాం

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: గత ఐదేళ్ల వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు మనం మంచి చేశామని, ఇప్పుడు కూడా వారి కష్టసుఖాల్లో తోడుగా ఉందామని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వండవ క్యాంపు కార్యాలయంలో భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఓటమికి కారణాలు పాజిటివ్‌గానే స్వాగతించాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని, ఆ కృతజ్ఞత అందరిలోనూ ఉందన్నారు. కుటుంబంలో ఎంతమంది చదువుకున్న పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు చొప్పున తల్లికివందనం పేరిట ఇస్తామన్న టీడీపీ హామీని ఇంకా నెరవేర్చలేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతీ ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతన్నకు పెట్టుబడి సాయం, మత్స్యకారులకు వేటనిషేధ భృతి, విద్యార్థులకు విద్యాదీవెన వంటి నిధులు సమయానికి విడుదల చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రజల పక్షాన పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు తోట సింహాచలం, బి.ప్రసాద్, కె.ధర్మారావు, మజ్జి మోహనరావు, టింగ అన్నాజీరావు, కె.చంద్రశేఖరరావు, కె.ఆంజనేయులు, కె.కృష్ణారావు, రమణ, రమేష్ పాల్గొన్నారు.

కలలు కన్నీరై...

దంపతులిద్దరూ కూలీలే అయినా వారి జీవితం ఆనందమయం. వచ్చిన కూలి డబ్బులతో సంతోషంగా జీవనం సాగించేవారు. వారి అన్యోన్యతను చూసి ఊరే ముచ్చటపడేది. వివాహమైన 15 ఏళ్లకు కవలలు జన్మించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పిల్లలను చూస్తూ మురిసిపోయేవారు. ఇంతలో విధి కన్నెర్ర చేసింది. పిల్లల మందుల కోసం వెళ్లిన భర్తను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. ఇద్దరు పిల్లలు, భార్యను అనాథలను చేసింది. కలలను కన్నీటితో చెరిపేసింది.

- పెళ్లయిన 15 ఏళ్లకు ఇద్దరు పిల్లలు
- సంతోషంలో మురిసిపోయిన కూలి దంపతులు
- పిల్లల మందులకు వెళ్లిన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి
- అనాథలైన పిల్లలు, భార్య
- విషాదంలో వెంకటరమణపేట వాసులు



కవల పిల్లలతో దిక్కుతోచని స్థితిలో మృతుని భార్య లక్ష్మి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గేదెల కృష్ణ

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం వెంకటరమణపేట గ్రామానికి చెందిన గేదెల కృష్ణ(42) క్వారీ కార్మికునిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి లక్ష్మితో సుమారు 15 ఏళ్ల కిందట వివాహమైంది. సంతానం లేక పోవడంతో నిత్యం మదనపడేవారు. సంతానం కోసం మొక్కని దేవుడు లేడు.. తిరగని ఆస్పత్రి లేదు. చివరకు రెక్కలు ముక్కలు చేసుకుని దంపతులిద్దరూ కూలిచేసి సంపాదించిన సొమ్ముతో శక్తికి మించి లక్షలు ఖర్చు చేసి సంతాన సాఫల్య కేంద్రంలో కొన్నేళ్లుగా వైద్యం చేయించుకున్నారు. వారి కలలు ఫలించాయి. లక్ష్మి గర్భం దాల్చింది. దీంతో వారి సంతోషానికి అవధులు లేవు. రెండు నెలల కిందట కవల (మగబిడ్డ, ఆడబిడ్డ)లకు లక్ష్మి జన్మనిచ్చింది. బిడ్డలను చూస్తూ దంపతులిద్దరూ మురిసిపోయారు. అంతలోనే విధి కన్నెర్రచేసింది. ఇంటి పెద్దదిక్కును మృత్యువు కాటేసి సంతోషాన్ని ఆవిరిచేసింది.

భర్త దూరం.. బతుకు భారం..

క్వారీలో పనిచేసే కృష్ణ తన కష్టం మరిచిపోయి భార్య, బిడ్డలతో సరదాగా ఉండేవాడు. మంగళవారం ఉదయం పిల్లలకు మందులు తెస్తానంటూ బైక్‌పై విశాఖ వెళ్తున్న సమయంలో వేపగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న భార్య కన్నీరుమున్నీరవుతోంది. బిడ్డలకు, తనకు దిక్కెవరంటూ ఆమె రోదన వర్ణనాతీతం. కృష్ణ చనిపోయాడన్న వార్తతో ఊరంతా ఒక్కసారి ఘొల్లుమంది. భార్య లక్ష్మి రెండునెలల చిన్నారులను ఎత్తుకుని ఏడుస్తుంటే ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. ఏ దిక్కూలేని ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు సహకరించాలని, పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం, పాలకులు స్పందించి సహాయం అందించాలని గ్రామపెద్దలు, గ్రామస్తులు కోరుతున్నారు.

మలేరియాపై అప్రమత్తతే ప్రధానం

- జోనల్ మలేరియా నివారణ అధికారి శాంతి ప్రభ



అచ్చబ గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా నివారణ అధికారి శాంతిప్రభ

సీతంపేట: మన్యంలో మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా నివారణాధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ అన్నారు. రెండు రోజుల కిందట శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి ఆశ్రమపాఠశాలకు చెందిన విద్యార్థిని మలేరియాతో మరణించడంతో ఆమె స్వగ్రామమైన అచ్చబ గ్రామాన్ని ఆమె సందర్శించారు. మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన దోమల నివారణా మందు పిచికారినీ పరిశీలించారు. సీజనల్ జ్వరాలు ప్రబలకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న తీరు, నివారణా చర్యలపై ఆరా తీశారు. దోమల నియంత్రణకు డ్రైడే, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి టి.జగన్‌మోహన్‌రావు, ఏఎంఓ సూర్యనారాయణ, కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు

మెంటాడ: మండలంలోని మీసాలపేట గ్రామంలో ఈ నెల 5న విద్యుత్‌షాక్‌తో రైతు దంపతులు కోరాడ ఈశ్వరరావు, ఆదిలక్ష్మి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈదురుగాలులకు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగెను సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రమాదం సంభవించినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనికి బాధ్యులుగా ఏఈ తిరుపతిరావు, లైన్‌మెన్ సుదర్శన్, జూనియర్ లైన్‌మెన్ కాంతారావును సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

- ఫిర్యాదు చేసిన ఉపాధిహామీ వేతనదారులు



వేతనదారులతో విచారణ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధిహామీ పనులు చేయాలంటే లంచం ఇవ్వాల్సిందేనని, మరోవైపు తమను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని గుర్ల మండలం పాలవలస గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులు తహసీల్దార్ ఎదుట తమ బాధను వెళ్లగక్కారు. ఉపాధి పనులకు వెళ్తున్న తమను లైంగికంగా వేధించడంతో పాటు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఉపాధిహామీ వేతనదారులు ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు మంగళవారం గ్రామంలోని సచివాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేతనదారులు చేసిన ఆరోపణల మేరకు తహసీల్దార్ రమాదేవి విచారణ చేపట్టారు. ఈ విచారణకు వేతనదారులు హాజరై వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధి హామీ పనుల కోసం ఫీల్డ్ అసిస్టెంట్ తమను లైంగికంగా వేధిస్తున్నారని, ఉపాధి హామీ పనులు చేసుకునేందుకు అవసరమైన జాబ్‌కార్డు కావాలని అడిగితే 5వందలు రూపాయలు వసూలు చేస్తున్నారని, అంతేకాకుండా ఉపాధి పనులకు సంబంధించి ప్రతి ఒక్కరు నుంచి వారానికి రూ.50 వసూలు చేస్తున్నారని విచారణలో తెలిపారు.

18 నుంచి కుష్ఠు వ్యాధిపై సర్వే

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఈనెల 18వతేదీ నుంచి ఆగస్టు 2 వతేదీ వరకు జిల్లాలోని కుష్ఠు రోగులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈమేరకు ఆయన తన చాంబర్‌లో మంగళవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్మంపై స్పర్శ, దురద, నొప్పి లేని మచ్చలు కుష్ఠు వ్యాధి లక్షణాలని తెలిపారు. చర్మంపై ఎర్రని, రాగిరంగు మచ్చలు ఉంటే కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 2022లో జిల్లాలో 317 కేసులు నమోదయ్యాయని, 2023లో 372 కేసులు, 2024లో ఇప్పటి వరకు 70 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కుష్ఠు రోగులను త్వరగా గుర్తించడం ద్వారా వారు అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. జిల్లాలో 1785 టీమ్‌లు ఇంటింటా సర్వే నిర్వహించనున్నాయని తెలిపారు. వానిరి ఆశవర్కర్, స్వచ్ఛంద వలంటీర్ టీమ్‌గా ఉంటారని చెప్పారు. ఈనెల 15వతేదీ నుంచి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 7,713 ఓఆర్ఎస్ కార్నర్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుత కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీలు, జేసీబీల సీజ్



రెవెన్యూ అధికారులు పట్టుకున్న లారీలు, జేసీబీలు

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో కొండపోరంబోకు కొండ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న 5 లారీలతో పాటు రెండు జేసీబీలను రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి సీజ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి గాను ఎటువంటి అనుమతులు లేకుండా 10 ఎకరాల విస్తీర్ణంలో గల కొండ పోరంబోకు నుంచి గ్రావెల్‌ను కొద్ది రోజులుగా అక్రమంగా తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందగా ఆర్ఐ సతీష్‌తో పాటు సర్వేయర్, వీఆర్‌ఓతో పాటు సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించి గ్రావెల్ తరలిస్తుండగా లారీలను, జేసీబీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం భూగర్భగనుల శాఖ ఏడీఏకు అక్రమ రవాణా విషయమై నివేదిక అందచేసి చర్యలు తీసుకోనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹214

ప్రతిభ చూపితే.. భవిత మీదే

- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6-11వ తరగతి విద్యార్థులకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- సెప్టెంబరు 15 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన తుదిగడువు



విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లోగో

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం)పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా విద్యార్థి విద్యాన్‌మంథన్(వీవీఎం) పేరిట ఏటా ప్రతిభాన్వేషణ పరీక్షను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో 1599 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఈ పాఠశాలల్లో 1,18,569 లక్షల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్ షిప్ పొందే అవకాశం ఉంది.

'జూనియర్, సీనియర్ విభాగాల్లో...

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6-8 తరగతులకు జూనియర్, 9-11 తరగతులకు సీనియర్ గ్రూపుగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

100 మార్కులకు పరీక్ష

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్ష అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. అయితే ఇందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్యకాలంలో 90 నిమిషాల పాటు పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్ -ఎ లో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు, సెక్షన్ -బిలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, రీజనింగ్ 10 ప్రశ్నలు ఉంటాయి.

హెచ్ఎంలు కృషి చేయాలి



ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు విజ్ఞాన్ మంథన్ పరీక్షల్లో పాల్గొనేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. రోజూ ఒక గంట కోచింగ్ ఇచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తయారు చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 20 నుంచి 30 వరకు విద్యార్థుల నమోదు ఉంటే ఆ పాఠశాలలకు పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తారు.

– జి. పగడాలమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

దరఖాస్తు విధానం ఇలా...

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ. 200రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశపరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న అండ్రాయిడ్, మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాలను ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటుంది. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వైబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి విద్యార్థుల వంతున 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2023-24లో జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1-3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

రోటరీ సేవలకు పురస్కారాల పంట



సాధించిన అవార్డులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: విజయనగరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో అందించిన సేవలకు పురస్కారాల పంట లభించింది. క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు సంబంధించి 27 అవార్డులు దక్కించుకున్నారు. ఈ మేరకు కొత్తగ్రహారంలో గల రోటరీ క్లబ్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు రోటరీ క్లబ్‌కు దక్కిన అవార్డుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో విజయనగరం జిల్లా కేంద్రంలో రోటరీ క్లాక్ టవర్, నెల్లిమర్లలో ఉచిత మంచి నీటి ప్లాంట్‌ల ఏర్పాటుతో పాటు ఉచిత రక్తదాన శిబిరాలు, నేత్ర వైద్య శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టినందుకు అవార్డులు లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 2024-25 సంవత్సరానికి సంబంధించి నూతనంగా క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన జి.వినోద్‌కుమార్, జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ఆపదలో ఉన్నవారికి అత్యంత అవసరమైన రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, ఆర్.శంకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రోటరీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు.తొలుత కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలు సమకూర్చారు. మొక్కలు నాటారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన వీరు మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు వీడాలని, రక్తదానం చేసిన వ్యక్తి చురుగ్గాగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రక్త నిధి కేంద్రాల్లో రక్తం నిల్వల కొరతను అధిగవించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డి.ఉమాబాలాజీ, ప్రతినిధులు అరుణ్‌కుమార్ సాధాని, జి.శివ కుమార్, జయకృష్ణ, టీఎల్ఎన్. మూర్తి, వీవీ రాజేష్, బత్తుల చందులతో పాటు రోటరీ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

చిరుద్యోగులపై కక్ష సాధింపు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథ రావు

- సీఐటీయూ ఆవేదన

పార్వతీపురంటౌన్: చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం గెలిచిన తర్వాత ఆ నాయకులు కిందిస్థాయి చిరు ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం చాలా దురదృష్టకర మన్నారు. జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ ఎంపీడీఓ పిలిచారని తన చాంబర్‌కు పిలిపించుకుని దుర్భాషలాడడం సరికాదన్నారు. జూన్ 30వ తేదీన జోగులుదుమ్మ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బూర్ల నాగమణిని మహిళ అని చూడకుండా మానసికంగా వేధిస్తూ నీకు నువ్వుగా రాజీనామా చేయాలని లేని పక్షంలో ఇబ్బందులు తప్పవని బూతులు తిడుతూ మానసికంగా వేధించారని మండిపడ్డారు. సిగబడి ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రసింహాచలం బలవంతంగా రాజీనామా చేసినట్లు తన చాంబర్‌లో సంతకం పెట్టించడం దారుణమైన చర్య కావున, ఇలాంటి కక్ష సాధింపు చర్యలు ఎంపీపీ మానుకోవాలని హితవు పలికారు. ఈ విషయమై గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షుడు హరినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

- వచ్చే నెల 16నుంచి జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు
- జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కేపీ నాయుడు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీ లు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేపీ నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా 18న అండర్-11, 13 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు సింగిల్స్/డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా 19న అండర్-15,17 వయస్సుల విభాగాల్లో, 20న అండర్-19, మెన్/ ఉమెన్ విభాగంలో, 21న వెటరన్స్ విభాగంలో సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సింగిల్స్ విభాగానికి రూ.500, డబుల్స్ విభాగానికి రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, కొత్తవలస, ఎస్‌కోట, విజయనగరం, చీపురుపల్లి కేంద్రాలుగా ఎంట్రీలు నమోదు చేయనున్నామని ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 15లోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

వచ్చే నెల 16నుంచి జిల్లా వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు

ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉత్తర్వుల మేరకు 2024-25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా వేదికగా వచ్చే నెల 16 నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజు పాటు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కేపీ నాయుడు వెల్లడించారు. నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు అక్టోబర్ నెలలో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నున్న సురేష్, అసోసియేషన్ ప్రతినిధులు వై.కుసుంబచ్చన్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ మత్స్యకార దినోత్సవం

పార్వతీపురంటౌన్: జాతీయ చేపల పెంపకం మండలి (ఎన్ఎఫ్‌డీబీ) సహకారంతో చేపల పెంపకం, మత్స్య మంత్రిత్వశాఖ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ ప్రతి సంవత్సరం జూలై 10న జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని జరుపుకుంటోందని పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖాధికారి తురుపతయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థిరమైన నిల్వలు, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలను నిర్ధారించడానికి దేశం మత్స్య వనరులను నిర్వహించే విధానంలో మార్పులపై దృష్టిని ఆకర్షించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. చేపల పెంపకంలో చేపల రైతులు, ఆక్వాప్రెన్యూర్లు, ఫిషర్ ఫోక్‌లు, భాగస్వాములు, చేపల పెంపకంలో వారి సహకారం కోసం ఇంకా ఎవరు సంబంధం కలిగి ఉన్నారో వారిని గౌరవించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24వ జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఆర్‌సీఎం స్కూల్ బిల్డింగ్ మీటింగ్ హాలులో నిర్వహించనున్నామని తెలిపారు.

గంగ పుత్రుల బెంగ



చింతపల్లి తీరంలో నిలిపిన బోట్లు

- మత్స్యకార భరోసా సాయంపై నీలినీడలు
- సముద్రంలో వేట ప్రారంభమై 20 రోజులు
- ప్రభుత్వం నిర్ణయం కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

పూసపాటిరేగ: సముద్రంలో చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం మత్స్యకార భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. సముద్రంలో వేట నిషేధ సమయం ముగిసి 20రోజులు దాటుతున్నా నూతన సర్కారు నుంచి ఎటువంటి ప్రకటన వెలవడలేదు. సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులకు ఈఏడాది మత్స్యకార భరోసా అందని ద్రాక్షలా మిగలడంతో ఇబ్బంది పడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసాను పెంచడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచి వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున అకౌంట్‌లో జమచేశారు. అయితే నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మత్స్యకార భరోసాపై కనీసం ప్రకటన చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4వేలు ఉన్న మత్స్యకార భరోసాను రూ.10 వేలుకు పెంచి వెంటనే అకౌంట్లలో జమచేసేది. 2020, 2021, 2022, 2023 సంవత్సరాలలో క్రమం తప్పకుండా మత్స్యకారుల ఖాతాలకు భరోసా నగదు జమచేసింది. జిల్లాలో ఈఏడాది మత్స్యకార భరోసాకు 3,798 మందిని ఎంపిక చేశారు. సర్వే కూడా పూర్తయిన తరువాత అర్హులను గుర్తించి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలో మీటర్ల తీరప్రాంతం ఉంది. ఆ తీరప్రాంతం పరిధిలో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. చేపల వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది జీవిస్తున్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్రప్రభుత్వం 61 రోజుల పాటు వేట నిషేధం ప్రకటించింది. ఆ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం సాయం అందిస్తుంది. కానీ నూతనగా వచ్చిన ప్రభుత్వం సాయం ఊసెత్తకపోవడంతో అసలు సాయం అందిస్తుందా? లేదా? పథకానికి మంగళం పాడుతుందా? అనే విషయమై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

తక్షణమే మత్స్యకార భరోసా ఇవ్వాలి



వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి మత్స్యకార భరోసా సాయం అందించాలి. వేట నిషేధ సమయం ముగిసి 20 రోజులు దాటుతున్నా ప్రభుత్వం కనీసం ప్రకటన కూడా విడుదల చేయలేదు. మత్స్యకారులకు తక్షణమే సాయం చేసి ఆదుకోవాలి.

– బర్రి దాసు, మత్స్యకారుడు చింతపల్లి పెద్దూరు

సాయం అందేదెప్పుడు?



నిషేధం తరువాత వేట ప్రారంభించి 23 రోజులు అవుతున్నా నిషేధ సమయంలో మంజూరు చేయాల్సిన నగదు అకౌంట్‌లోకి జమకాలేదు. గతంలో వేట నిషేధసమయంలో అకౌంట్‌లోకి సాయం జమకావడంతో సంతోషంగా గడిపేవాళ్లం. నేటి పరిస్థితి చూస్తే కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మత్స్యకార భరోసాపై ఎటువంటి ప్రకటన చేయలేదు. తక్షణమే స్పందించి మత్స్యకారులకు సాయిం అందించాలి.

– బర్రి చినఅప్పన్న, జిల్లామత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

బొత్స హయాంలో అభివృద్ధి



మంత్రి బొత్స జన్మదినోత్సం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

- రాష్ట్రంలో ఆదర్శంగా చీపురుపల్లి నియోజకవర్గం
- మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- ఘనంగా మాజీమంత్రి జన్మదినోత్సవం

చీపురుపల్లి: మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హయాంలో చీపురుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణయుగంలా నడిచాయని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన ఘనత ఆయనకే దక్కుతుందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల నేతల ఆధ్వర్యంలో మంగళవారం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన కేక్ కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీగా వెళ్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహించి, బాపూజీ వృద్ధాశ్రమం, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అంతకుముందు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ 2004కి ముందు అభివృద్ధికి దూరంగా ఎలాంటి సౌకర్యాలు లేకుండా చీపురుపల్లి నియోజకవర్గం ఉండేదన్నారు. కనీసం రోడ్డు, తాగునీటి సౌకర్యం కూడా లేవన్నారు. అలాంటి పరిస్థితుల్లో 2004లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ ఎమ్మెల్యే అంటే అర్థాన్ని చూపించారన్నారు.

ఇనుమడించిన నియోజకవర్గ అభివృద్ధి

నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, రహదారులు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని చెప్పారు. సంకిలి నుంచి రాజాం మీదుగా తాగునీటిని చీపురుపల్లికి తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోనే చీపురుపల్లి నియోజకవర్గం పేరును ఇనుమడింపజేసిన ఖ్యాతి బొత్సకు దక్కుతుందన్నారు. అలాంటి నాయకుడిని ఇటీవల ఎన్నికల్లో ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వెలిబుచ్చారు. నిరంతరం ప్రజా సేవ చేస్తూ, అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులను ఓడిస్తే ఎవరికి నష్టమో ప్రజలే గమనించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, దన్నాన జనార్దనరావు, బెల్లాన త్రినాథరావు, కరిమజ్జి శ్రీనివాసరావు, చందక గురునాయుడు, బెవర ఉమాకుమారి, గవిడి సురేష్, కొసిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు